# బ్రతుకు చిత్రం

**–కె.కె.రఘునందన**

పై సంబంధం చేస్తే దూరాబారాలని, నేనయితే దగ్గరని చెప్పి ఎంతో గొప్పగా చెప్పుకుంటూ తన కూతురు రంజని మెడలో తాళికట్టించేశాడు శివరాం మామయ్య.

రికామీగా తిరగకుండా నడుం వంచి పని చేయాలన్నది ఆయన వాదన. చాలీచాలని గొర్రెతోక జీతాలతో, దుకాణం కొలువులు చేస్తూ, చిత్తం బత్తెం అంటూ బ్రతకలేనని నా వాదన.

అయినా మామయ్య పోరుపడలేక రెండు మూడు ఉద్యోగాల్లో చేరటం, మనసుకి నచ్చక మానేయడం మామూలైపోయింది. 'మీ నాన్నకు ఆస్తి ఉంది. కనీసం కొంతయినా యిస్తే ఏదో వ్యాపారం పెట్టుకుంటాను కదా' అనే వాడిని రంజనితో. 'మీరు స్థిరులు కారేమోనని ఆయన అనుమానం. వ్యాపారం అన్నాక తిమ్మిని బమ్మిని చేయగల సమర్థత ఉండాలి. అంతే తప్ప మీలా ముక్కుసూటితనం అసలు పనికి రాదు.' ఆమెలో కూడా నా ఉనికి పట్ల అపనమ్మకం ద్యోతకమయింది.

మామయ్య ఆస్తిని ఎక్కడ అస్తవ్యస్తం చేస్తానోనని వారి బెంగ. నాకంటూ చేతిలో ఏదయినా కొంత పైకం వుంటే ముందుకెళ్ళగలనన్న ధీమా నాది.

మా ఇద్దరి ఉద్దేశ్యాల్లో చుక్కెదురు!!

అక్కడితో ఆగితే బాగుండేది. మరో అధ్యాయంలోకి తొంగి చూసిన చేదు సంఘటన.

ఒక రోజు – స్నేహితులతో గడిపి వచ్చేసరికి తొమ్మిదయిపోయింది. భోజనాల దగ్గర సమయం – పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కోవడానికి వచ్చి టేబుల్ ముందు కూర్చున్నాను.

అత్తయ్య, మామయ్యలు నవ్వుకుంటూ తింటున్నారు. రంజని వడ్డిస్తుంది.

'అమ్మా! నీ వంట అద్భుతం. ఈ పప్పులో నేయి కలుపుకుంటూ తింటుంటే మహా భాగ్యంగా ఉంది. అన్నట్లు మీ ఆయనకు వడ్డించమ్మా. పాపం! నౌకరీ చేసుకుని వచ్చాడు. 'మామయ్య మాటల్లో వ్యంగ్యం నేను పోల్చుక పోలేదు.'.

'అరెరె – ఔనండీ! పాపం! అల్లుడు ఎంత హడలిపోయాడు. ఒక ఊరా... ఒక వాడా! ఒకటే తిరుగుడు కదా!' అత్తయ్య వెటకారం.

పప్పులో నేయి కలుపుకోవాలని గిన్నెను తీసుకోబోయాను.

గభాలున లాగేసుకున్నాడు శివరాం మామయ్య!!

"ఈ కమ్మటి నేయి నాది.. మేం వేసుకుందికే.. ఆస్తి నాది కదా. మా ఇష్టం వచ్చింది తినొచ్చు. మరీ నీ దగ్గరా చిల్లిగవ్వ లేదు. అందుకే నీకు నేతి భోజనం హుళక్కి' అని మరింత నేయి వంపుకుని లొట్టలేసాడు మామయ్య...

ఫక్కున నవ్వింది మణత్తయ్య...

దిగ్గున లేచాను.

"ఆహ హా... అన్నం పరబ్రహ్మ స్వరూపం...' దాని ముందర నుంచి లేవడం అశుభం అంటారు. నేయికాక పోతె నూనె వేసుకొని కానివ్వండి. బాగా తిని బ్రేవుమని త్రేన్చండి" అంది రంజని నూనె వడ్డిస్తూ.

రంజనిలో ఎంత మార్పు...? చివరిదాకా నాతో అన్ని అనుభవాలు పంచుకొని కాపురం చేయాల్సిన ఆమె... ఇలా ప్రవర్తిస్తున్నదేంటి? ఇంకోపాటి ఆడదయితే తల్లిదండ్రుల ముక్కుపిండి మరీ ఆస్తిని రాయించుకునేది.

వాళ్ళింకా కుళ్ళు జోకులతో కాలక్షేపం చేస్తున్నారు.

అన్నం హితవు కాలేదు... నాకు.

నన్ను చులకన చేస్తూ తూట్లు పొడిచి ఎద్దేవా చేయడమే వారి ప్రధాన లక్ష్యమన్నట్టుగా ప్రవర్తిస్తున్న వాళ్ళను చూస్తే ఎంతటి జుగుప్స కలిగిందో చెప్పలేను.

తరువాత ఓ సంఘటనతో వారి విశ్వరూపం బయటపడింది. ఒక సాయంత్రం నేను వీధిలోంచి

## మేఘమాల!

నిన్న
మేఘ సందేశం
ప్రేమార్తి!

నేడు
మేఘ మధనం
దాహార్తి!

రేపు
మేఘ యుద్ధం
రక్తార్తి!!

**–జి.జి.కె.రావు**

# రాజగృహం

నల్లరేగడి మట్టి మీద
పారిజాత పూలు జలజలా రాలి పడ్డట్టు
అప్పుడే పితికిన గుమ్మ పాలకుండపై
తెల్లని మబ్బు నురగలు పొంగిపొరలినట్టు
బేళ్లు కట్టడానికి ముందు
పొలంలో రాశిపోసిన పత్తికొండ
ఫక్కున నవ్వినట్టు... ఆ యిల్లు.

ఆకాశయానం విసుగుపుట్టి
ఆటవిడుపు కోసం
చందమామ కాసేపు నేలకు దిగినట్టు
రాత్రిపూట భూలోక విహారానికి వచ్చిన దేవకన్య
జలతారు మేలిముసుగు జారవిడుచుకున్నట్టు
ఎన్నాళ్లుగానో కవిత్వం రాయకపోయినా
కవి మీద గొప్ప ప్రేమతో
తెల్లకాయితం మెరుపు తెలుపును నిలుపు
కున్నట్టు... ఆ యిల్లు.

తాజ్‌మహల్‌ని చూడ్డానికి
ఆగ్రా దాకా రానవసరం లేదని
వరంగల్‌లోనే నమూనా కట్టినట్టు
వైట్‌హౌస్‌ను అమెరికోడే కాదు
మా నర్సంపేట పోరడూ కట్టగలడని నిరూ
పించినట్టు
సప్తవర్ణాల ఇంద్రధనుస్సుగా
విస్తరించే సూర్యకిరణం
ఇకపై గాజు పట్టకాన్ని బదులు
ఈ గాజు మేడను ముద్దాడదలిచినట్టు... ఆ
యిల్లు.

వచనానికీ కవిత్వానికి
మధ్యనున్న వ్యత్యాసంలా
బతకడానికీ
జీవించడానికీ మధ్యగల తేడాను గుర్తుచేస్తుంది...
ఆ యిల్లు.

అన్నా! బన్న అయిలయ్యా!
వెలివాడ మీద వెన్నెల కుప్పలు కురిసినట్టు
రాచటీవితో వెలిగే నీ సమతా కలల సౌధానికి
రాజ్యాంగ నిర్మాత స్ఫూర్తితో
'రాజగృహం' అని పేరు పెట్టుకున్నావు సరే!
రాజ్యాధికారానికి పోరుబాట ఏమైనా ఆలో
చించావా?

—శిఖామణి

వచ్చేసరికి రంజని కనబడలేదు. మణత్తయ్య వండి వార్చింది. పిల్లలిద్దరితో ముద్దుల మాటలాడ్తున్నాడు శివరాం మామయ్య.

పిల్లలను దగ్గరకు తీసుకుని లాలించబోయాను. కాని నా దగ్గరకు వాళ్ళు రాలేదు. వారిని నాకు దూరం చేస్తున్న పాపం అత్తయ్య, మామయ్యలదే....

నిజానికి వాళ్ళని అనాల్సిన పని లేదు. ఈ చులకనకి పూర్తి కారణం రంజని ... కావాలనే నాకు దూరం చేస్తున్నది...

తొమ్మిది దాటాక వచ్చింది రంజని...

'పిల్లలను వదిలిపెట్టి ఎక్కడ ఊరేగుతున్నావు" ఆవేశం ధ్వనించింది నా గొంతులో.

"ఊరేగటం మీ ఒక్కరి హక్కులా మాట్లాడ్తున్నారే"

"చెప్పు - ఇంతదాకా ఎక్కడికెళ్ళావు' కటువుగా అడిగాను.

'ఉద్యోగానికి'

ఎవర్నడిగి చేరావు.

నన్ను నేనే అడుక్కున్నాను. అదేమిటో తెలుసా! తల్లిదండ్రుల మీద ఆధార పడ్డాం. వారి ఆస్తికి ఆశించ డం ఎంతవరకూ సమంజసం అని అప్పుడు నా మనసు నన్నడిగింది. కొండంత భర్త నీకు అండగా ఉండగా... నీ కెందుకీ పాట్లు అని... కాని నేను నా మనసుకి చెప్పేసాను. ఆయన విగ్రహ పుష్టి... నైవేద్యం నష్టి అని..."

'షటప్' ఆకస్మికమైన ఉక్రోషం... నన్ను నిలువెల్లా దహించి వేసింది.

'పైసా ఆర్జన లేకుండా మీరు తిరుగుతుంటే చూస్తూ భరించలేక ఉద్యోగంలో చేరాను. అది మీ దృష్టిలో నేరమైతే అంతకంటే ఘోరం మరోటుండదు.

'దుకాణాల్లో కొలువు నాకు నచ్చదు. కానీ అదే నువ్వు చేస్తున్నావు తప్ప మీ నాన్నను పెట్టుబడి అడగవు.

'అడగను కాక అడగను. రెక్కలు ముక్కలు చేసుకుని బ్రతుకుతాను తప్ప చేయి చాచను. మీలా పౌరుషం లేని దాన్ని కాను'.

'అంటే నీ దృష్టిలో... అల్లాటప్పాగాడిలా కనిపిస్తు న్నానా'

'కాకపోతే మరేంటి... మీరంటూ ఏదో ఓ పనిలో స్థిరపడితేనే మీ విలువ పెరిగేది'.

ఇద్దరి మధ్య వాగ్యుద్ధం తారాస్థాయికి చేరింది. మధ్యలో దూరి నన్ను ఎద్దేవా చేస్తున్నట్లుగా మాట్లాడారు అత్తయ్య, మామయ్య.

ఈ వాతావరణం ఇలా సాగుతుండగా ఒక రోజు వీధిలోంచి నేను వచ్చే సరికి ఇల్లంతా నాన రభసగా ఉంది.

ఇంట్లో మూలమూలలా వెతుకుతోంది రంజని... బీరువాల్లో సామాన్లు చిందర వందరగా పడేసారు.

'ఎంతో కష్టపడి చేయించుకున్నారమ్మా... మీ నాన్న. నీ దగ్గరయితే క్షేమంగా ఉంటుందని నీ దగ్గరుంచాం. నిష్కారణంగా పోయాయి' అంటుంది మణత్తయ్య విసుగ్గా.

'మా నాన్నగారి సింహ తలాటాలు పోయాయండి. వాటి కోసమే ఈ కంగారంతా... ఎవరు తీసారో తెలీటం లేదు. తాళాలు గూట్లో పెట్టొదిలాను. మీరు బట్టల కోసం తీసి వదిలెయ్యలేదు కదా. బీరువా తెరిచేసి వెళ్ళి పోవడం మీకు అలవాటే లెండి' చిరాగ్గా అంది రంజని.

'పోనీ పోలీసు రిపోర్టివ్వండి మామయ్య! వాళ్ళే తేలుస్తారు' సలహా ఇచ్చాను.

'ఏంటయ్యా తేల్చేది? ఇంటి దొంగను ఈశ్వరుడయినా పట్టుకోలేడని... పోలీసు కేసులంటూ ఎవడు తిరగ్గలడు. ఇదెవరో బాగా తెలిసిన వారి పనే, నిందిస్తున్నట్లుగా అన్నాడు శివరాం మామయ్య.

పని మనిషి ఆదెమ్మను నిలదీయమన్నాను.

ఆదెమ్మంత నమ్మకమయిన మనిషిని మరొకరిని చూడలేదన్నారు. వారి సూటి పోటీ మాటలన్నీ పరోక్షంగా నాకే తగులుతున్నట్లుగా అనిపించి తెగ బాధపడ్డాను.

సరిగ్గా ఆ సమయంలోనే రంజని నా గదిలోంచి వస్తూ 'ఛీ! ఎందుకండీ మీకీ పాడు బుద్ధి! మీకేం తెలీనట్టుగా నాటకాలాడారు. కోపంగా అడిగింది.

"ఏమిటి అర్థం లేకుండా వాగుతున్నావు?" చిరాకెత్తింది నాకు.

'ఇదిగో ఇది చూసి మాట్లాడండి. దీన్నే సింహ తలాటాలంటారు. ఇవి మా నాన్నవి'

'ఆ ఎక్కడ దొరికాయి' మామూలుగా అడిగాను.

సాక్షాత్తూ మీ అలమరలో...

ఆ మాటవిన్న నాలో పట్టలేని ఆగ్రహం...

"ఆ దొరికిందా ఏదమ్మా.... ఇలాతే... ఎందుకయ్యా... నువ్వీ వెధవ పనికి పాల్పడ్డావు" మామయ్య కోపంతో కదను తొక్కాడు.

'ఎందుకంటారేంటి? పని పాట లేనివాడికి డబ్బు ఎక్కడినుంచి వస్తుంది. వీటి నమ్మేసి హాయిగా కులాసాలు చేద్దామనుకున్నాడు" కరుగ్గా అన్నది అత్తయ్య.

'ఏమండీ! మీరెందుకిలా దిగజారారు. ఆస్తిలో వాటా కోసం క్షణం క్షణం నన్ను వేధించుకు తింటుంటే ఏమోననుకున్నాను. ఎలాగూ ఇవ్వరని తెలిసి దొంగతనానికి సిద్ధ పడ్డారా" రంజని జట్టేకి దిగింది.

వాళ్ళు విసిరిన శూలాలు సరాసరి నా గుండెలను ఛిద్రం చేశాయి. లేని నిందని నా మీద రుద్దటానికి వాళ్ళంతా విశ్వ ప్రయత్నం చేశారు. బిగ్గరగా కేకలేశాను. నా ఆవేదనను ఇసుమంతైనా అర్థం చేసుకోకుండా అనేక మాటలాడారు.

ఆ ఇంట్లో నాకు విలువ లేదనిపించింది. నేను వారి దృష్టిలో ఓ చేత కాని వాడిలా... దుష్టుడిలా ముద్రించుకుపోయాను.

నా ఉనికి మీద నాకే అసహ్యమనిపించింది. బుర్రంతా ఖరాబయి పోయింది. బయటకు వచ్చేసాను. ఆ రాత్రంతా ఆలోచించాక మరిక ఆ ఇంటి గడప తొక్కకూడదని దృఢంగా నిశ్చయించుకున్నాను. మర్నాడే రాజమండ్రి చేరాను.

నాకేం చేయాలో, ఎలా బ్రతకాలో తెలీని అగమ్య స్థితిలో నాకు బాబా ఆశ్రయం లభించింది.

గోదారి నదికి దగ్గరలోనే సత్యం బాబా ఆశ్రమం...

## వేదిక

**హ**క్కులు హరిస్తే
హామీలు మరిస్తే
పాత పద్ధతులు మారిస్తే
కొత్త కోరికలు జనిస్తే...
భూమి గూర్చి
భుక్తి గూర్చి
కులం గూర్చి
బలం గూర్చి
అణగారిన ప్రజల గూర్చి
అధికార పదవి గూర్చి...
అరిస్తే భరిస్తున్న
వేదనకు వేదికనౌతున్న
నీ నీడకై గుడారాలు వేస్తుంటే
గుండెల్లో నిత్యం గునపాలు దిగేసుకుంటూ
నీ ఆశయ సాధనకు
నిన్ను ఆశీర్వదిస్తున్న
విజయీభవ! దిగ్విజయీభవ!!

-వడ్డెపల్లి నర్సింగరావు

నాలా ఎందరెందరో గాలివాటుకి బ్రతుకుతున్న వారిని సేదతీర్చే దివ్యౌషధం బాబా వాక్కుల్లో దొరికేది. ఆయన శీతల ఛాయ మైమరపించేది. ప్రసన్న దృక్కులు. సచ్ఛీలత కలగలసి పవిత్ర గంగలా ప్రవహించేవి.

అయితే ఒక్కోసారి నేను ఒంటరిగా వున్నప్పుడు నన్ను నిలదీసే వారు బాబా.

"నీ వాళ్ళని వదిలిపెట్టి నమ్మకద్రోహం చేసావేమో ననిపిస్తున్నది. అలా చేస్తే నిన్ను దేముడు క్షమించడు. నేనిచ్చే నీడ నీకు సంపూర్ణమైన సంతృప్తి నివ్వకపోవ చ్చును. నేనున్నంతకాలం నీకీ పరిసరాలు ప్రశాంతత నిస్తాయేమో తప్ప, నీ వాళ్ళ దగ్గర నువ్వు పొందే తృప్తి గొప్పది.

నిజానికి బాబా మాటలు నన్ను నిశితంగా ప్రశ్నిం చేవి.

అయితే అలా బాబా నీడలో పదిహేనేళ్ళ జీవితం గడిపేసాక సత్యం బాబా పరమపదించారు. అయినా ఆయన చిట్టచివరి సారిగా బోధించిన ప్రవచనం మాత్రం గుండెల్లో పాతుకుపోయింది.

'బాబూ! ప్రతి మనిషి జీవితంలో వెలుగునీడలు సహజం. మనిషి ప్రయాణం ఈ రెండింటి మధ్యే సాగుతుంది. చివరకి చేరాల్సింది మృత్యువు ఒడినే. మనం జీవితాంతం తీసుకున్న శ్వాసలు ఎన్నో... కానీ మనం చివరన విడిచే శ్వాస మాత్రం పరమ పవిత్ర మైనది.. ఎందుకంటే ఆ శ్వాసలో సంతృప్తి నిండి వుండాలి... అసంతృప్తితో ఆ శ్వాస విడువరాదు. మనం ఎంత తృప్తిగా మనుగడ సాగిస్తామో అంత తృప్తిగా శ్వాస విడవాలి. అసంతృప్తితో బ్రతుకు సాగితే తుది శ్వాస కూడా అసంతృప్తితో పోతుంది. అదే పరమ నరకం. ఇది గుర్తు పెట్టుకుంటే మన ప్రవర్తనలో మార్పు వస్తుంది.

బాబా ప్రవచనాలు గుర్తొచ్చినప్పుడల్లా నాలో కర్త వ్యం వెన్ను తట్టేది. బాబా పోయినాక నేను అక్కడ ఒక్క క్షణం నిలువలేక పోయాను. కానీ ఎలా బ్రతకాలో బోధ పడలేదు..

ఆకలికి అర్థం తెలిసింది. ఏ కొలువునయితే నన్ను అసహ్యించుకున్నారో, వాటిలో పనిచేయక తప్పలేదు.

నేను చేస్తున్న కిరాణా సెంటర్‌లోనే ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళు పనిచేసే వారు. అందులో సమీర్ నూనూగు మీసాల కుర్రాడు. రోజూ ఎంతో కొంత ఆలస్యంగా వచ్చి దుకాణదారు చేత తిట్లు తింటుంటే వాడు.

"దుకాణానికి ముందే రావచ్చుగా... రోజూ చీవాట్లు తినడం సరదగా ఉందా?" అన్నాను.

"ఇంటి దగ్గర అన్నీ అమర్చుకుని వచ్చేసరికి లేటయిపోతోంది సార్!" బాధ పడుతూనే అన్నాడు.

"అయినా చక్కగా చదువుకోక నీకెందుకోయ్ ఈ యాతనలు" జాలిగా అన్నాను.

'మా అమ్మ పోయిందిసార్! మా నాన్నేమో మమ్మల్ని పట్టించుకోకుండా ఊళ్లు పట్టాడు. ఎదిగిన చెల్లెలుంది. నేనే అన్నీ చూసుకోవాలి కాబట్టి చదువు చెట్టెక్కింది' వేదనగా అన్నాడు సమీర్.

అది విన్న నాలో ఒక్కసారి అలజడి.

ఆ రాత్రంతా నాలో అనేకానేక ఆలోచనలు. గతం, వర్తమానాల నడుమ ఊగిసలాట...

ఒక రోజు నేను షాపుకి బయలుదేరుతుంటే ఒకా

## మా ఊరు

విశ్వం నా చుట్టూ
ఎంతో విశాలంగా ఉన్నా
మా ఊరును మించిన ఊరు
విశ్వంలో ఇంకెక్కడా లేదన్నది సత్యం
పుట్టగానే అక్కున చేర్చుకొని
గుండెనిండా నింపింది మమకారం
మా ఊరి గాలిలో
నిండి ఉంది జీవన లాలిత్యం
మా ఊరు మట్టి
సంజీవ పర్వత భాగం
ఇక్కడ బాల్యమెంత అమూల్యమో
బాల్యం తర్వాత కూడా పరిపూర్ణంగా
జీవించమని మా ఊరు మాకిచ్చింది వరం
ఇక్కడ హాహాకారాలు
ఆక్రందనలు ఉండవు
మట్టి కమ్మటి పరిమళమే గాని
నెత్తురు వాసన చిమ్మదు
పైన ఆకాశం
క్రిందన మా ఊరు
రెండూ స్వచ్ఛతకు ప్రతిరూపాలు
కోటి జన్మలెత్తినా
మళ్లీ మా ఊరి గడ్డమీద
నేను పుడతానో లేదోగాని
ఈ జన్మకు మాత్రం
మంచి గంధం లాంటి మా ఊరి మట్టిలో
కలసిపోవాలన్నదే నా అభిలాష.

—అనపర్తి సీతారాము

యన నన్ను కలిసి చెప్పాడు. 'సార్! వీధి చివర చిన్నారావు మేస్టారు చనిపోయారు. శవవాహకులు కరువైనారు. మీరొచ్చి కొంచెం సాయం చేయాలి. దయచేసి మీరు మా మాట మన్నిస్తే... ప్రాధేయ పడ్డాడు..

ఇలాంటి ఆపద సమయంలో సాటి మనిషికి సాయం. ఆయనతో వెళ్ళాను 'పాపం! మాష్టారు చనిపోయేలోగా కూతుళ్ళకి పెళ్ళిళ్లు చేయలేక పోయారు. కొడుకులకీ సరియైన ఉద్యోగాల్లేవు. పాపం! అసంతృప్తి తోనే పోయింది ప్రాణం.

'బ్రతికినంత కాలం యాతనలు, చిక్కులే' పెద్ద సంతానం నెట్టుకు రావటానికే రక్తమంతా ఇంకి పోయింది.

చిన్నారావు మేస్టారుతో అనుబంధం ఉన్నవాళ్ళు ఆయన మీద సానుభూతి కురిపించారు.

ఆ క్షణంలో ఒక్కసారి బాబా మాటలు జ్ఞాపకానికి వచ్చి గుండె కదిలింది. నాలో స్పష్టమైన సమీక్ష మొదలైంది. నేను, నా వాళ్ళు అన్న జ్ఞానం -- నాలో అనుబంధాల తహతహను రేకెత్తించింది.

ఔను! ఒకటా రెండా పదిహేనేళ్ళు ... ఎలా ఉన్నారో... ఏమైనారో అబ్బాయి సునీల్ ఏం చేస్తున్నాడో... అమ్మాయి దీపిక ఎదిగి వుంటుందేమో? ఈ మధ్యలో ఏమైనా అపశృతులుగాని....!! భయంతో ఒక్కసారి గుండె లదిరాయి.

వెళ్ళాలి... చూడాలి.. వాళ్ళతో గడపాలి.

ఇదే ఆలోచన... అనుబంధాలపై ఆసక్తి... తపన... తహతహ... ఇవే నన్ను విజయనగరం వైపు లాక్కెళ్ళాయి.

మా ఊరు పూర్తిగా మారిపోయింది. కచ్చా రోడ్లు పోయి పక్కా రోడ్లు వచ్చాయి. పాకలో ఉండే హైస్కూలు భవనంలోకి మారింది.

నా జన్మభూమి గాలి పీల్చేసరికి నాలో కొత్త శక్తి వచ్చింది.

గడ్డంలో ఉన్న నన్నెవరూ పోల్చుకోలేదు. మా ఇంటి పరిసరాలు బాగా మారిపోయాయి. పెంకుటిల్లు పోయి... డాబా తయారయింది.

తటపటాయిస్తూనే తలుపు తట్టాను.

తలుపు తీసింది... రంజనే.. నడి వయసులోని ముఖ కవళికలు పారాడు తున్నాయి. నన్ను పోల్చుకోలేక తటపటాయిస్తూ చూస్తోంది.

"నేనురంజనీ.. నేను నీ.." ఆతృతగా పల్కరించాను.

'మీరు... మీరు మీరేనా...'

'ఔను నేను రంజనీ...'

'ఇన్నేళ్ళ తరువాత మీరు.. కల కాదు కదా!' నేను వచ్చిన నిజం జీర్ణించుకోలేక పోతోంది.

ఒక్కసారిగా నన్ను అల్లుకుపోయింది. ఆమె కన్నీటితో నా చొక్కా తడిసిపోయింది. ఆమెను ఓదారుస్తూనే అంతా చెప్పాను.

శివరాం మామయ్య, మణత్తయ్యల గురించి అడిగాను. మరల బావురుమంది. గోడవైపు చూపించింది.

వారిద్దరి ఫోటోలకు దండలు వేసి ఉన్నాయి.

ఆరోజు మీలో మార్పుకోసమే అలా ప్రవర్తించారండీ... మా అమ్మ నాన్నలు.. మీ కాళ్ళమీద మీరు నిలబడాలన్న సదుద్దేశంతోనే ఏదైనా అనే వారండీ... ఆ రోజు మీరు వెళ్ళిపోయాక అందరం ఎంత కుమిలి పోయామో... మీలో పౌరుషం రావాలని నాటకం ఆడితే అది తిరగబడి ఇంతటి అగాధాన్ని సృష్టించింది. ఎప్పటికయినా మనసు మార్చుకుని వస్తారని ఎదురు చూసాం... ఎంతో వెతికాం... అంది ఏడుస్తూ.

అత్త మామల ఫోటోలు ఆప్యాయంగా తడిమి రోదించాను.

"రంజనీ.. మన పిల్లలు" నాలో ఉత్కంఠ.

సునీల్ ప్రస్తుతం లేడు. మెడిసిన్‌లో జాయిన్ అయ్యాడు. సంతోషంగా అంది.

'ఆ... నిజంగా నాకన్న తండ్రి ఎంత ఎదిగి పోయాడు. మరి దీపిక....'

'ఉంది... ఆ కన్నతల్లిని మీరు కళ్ళారా చూతురు గాని... అమ్మా... దీపికా.. దీపికా..' అని పిలిచింది.

ఓ పదహారేళ్ళ అమ్మాయి వచ్చి నిలుచుంది... వెన్నెల బొమ్మల్లే ఉంది.

'అమ్మా! దీపూ! మీ నాన్నగారమ్మా! వెళ్ళమ్మా..' అనగానే దీపిక నా ఒడిలోకి వచ్చింది.

హత్తుకుని ఏడ్చేసాను. ఆ చిన్నారి కనులు తడయ్యాయి.

'రంజనీ! నీవు చాలా గ్రేట్. నేను మీ అందరినీ అర్థంతరంగా వదిలిపెట్టి ఏమైనారో కూడా పట్టించుకోకుండా వెళ్ళిపోయినా నువ్వే మాత్రం అధైర్యపడకుండా కుటుంబాన్ని తీర్చి దిద్దావు. మగాడే కాదు ఆడది కూడా సుడిగుండాలకు ఎదురీదగలదని ఋజువు చేసావు. నువ్వు గ్రేట్ రంజనీ... గ్రేట్ విచలితుడనై రంజనిని హత్తుకున్నాను.

పశ్చాత్తాపానికి మించిన శిక్షను దేవుడు సృష్టించ లేదు. ప్రస్తుతం నేను అదే అనుభవించసాగాను. ■